ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు బండి సంజయ్ పరామర్శ

లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

విద్యానగర్, నవంబర్ 1 : కరీంనగర్ శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని శుక్రవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు: సీపీ

రాంనగర్, నవంబర్ 1: కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదని, మారణాయుధాలు ధరించి తిరుగకూడదని తెలిపారు. ఈ ఉత్తర్వులు ఈనెల 30 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు.

డ్రోన్ల వినియోగంపై నిషేధాజ్ఞలు

రాంనగర్, నవంబర్ 1: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఏయిర్ క్రాఫ్ట్‌ల వినియోగాన్ని నిషేధించినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఈనెల 30 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా వినియోగించదలచినట్లయితే సంబంధిత పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్రాల్లోని ధాన్యం మిల్లులకు తరలించండి

చిగురుమామిడి, నవంబర్ 1: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంతోపాటు సుందరగిరి, బొమ్మనపల్లి, ఇందుర్తి, ఆరుకాల పల్లెలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. రైతులు మధ్య దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, ఏమైనా సమస్యలు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. సుందరగిరి, ఇందుర్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అడిషనల్ కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లలో ప్రభుత్వ జాప్యంతో ఇప్పటికే మధ్య దళారులకు ధాన్యం విక్రయించామని కొందరు, ప్యాడీ క్లీనింగ్ చేయబోమని మరికొందరు రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తామని అడిషనల్ కలెక్టర్ రైతులకు సూచించారు. ఇక్కడ తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో మధుసూదన్, సివిల్ సప్లై డీటీ ఖాజా మొహినొద్దీన్, ఆర్ఐ అరుణ్ కుమార్, సంతోష్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ అన్వర్, సింగిల్ విండో సీఈవో నర్సయ్య, డీఎం రజినీకాంత్, ఏపీఎం సంపత్, సీసీలు సత్యనారాయణ, వెంకటమల్లు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 1 : పారమిత విద్యా సంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోపీకృష్ణ తెలిపారు. ఈనెల 2 నుంచి 4 వరకు మహబూబ్‌బాద్‌లో జరిగే బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జి. శ్రేష్ఠ (9వ తరగతి) ఎం. శ్రీతేజ్, సంగారెడ్డిలో ఈనెల 2 నుంచి 4 వరకు జరిగే కరాటే పోటీలకు ఎల్. ప్రీతమ్ చౌహాన్ (8వ తరగతి), ఆసిఫాబాద్‌లో ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు పి. రాహుల్ (9వ తరగతి) సి.హెచ్. భువన (8వ తరగతి), స్విమ్మింగ్ పోటీలకు ఎ. సంజయ్ రెడ్డి, బి వైష్ణవి ఎంపికయ్యారు. వీరిని పారమిత విద్యా సంస్థల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్స్ అభినందించారు.

రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు మానేరు విద్యార్థులు

కొత్తపల్లి, నవంబర్ 1 : పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం నుంచి మూడు రోజులపాటు జరిగే 68వ రాష్ట్రస్థాయి పాఠశాలలు, కళాశాలల అండర్-17, 19 ఉషూ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను అభినందించిన వారిలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, రాజు చాకో, మహేందర్, తిరుపతి, జహీదా, స్వామితో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎస్ఆర్ విద్యార్థి

కొత్తపల్లి, నవంబర్ 1 : వరంగల్‌లో ఈ నెల 2 నుంచి 4 వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అలుగునూర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి దాసరి రిషి ఎంపికైనట్లు ఇన్‌చార్జి ఎన్ తిరుపతి పేర్కొన్నారు. రిషిని కళాశాల చైర్మన్, డెరెక్టర్లు అభినందించారు.

ప్రజాప్రతినిధులు హాస్టళ్లు సందర్శించాలి

- వాటిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- నగరంలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలలో దీపావళి వేడుకలకు హాజరు

మాట్లాడుతున్న మంత్రి పొన్నం

కలెక్టరేట్, నవంబర్ 1: జిల్లాలోని ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు తమ నియోజకవర్గాల పరిధిలోని సంక్షేమ వసతి గృహాలు సందర్శిస్తూ, వాటిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బీసీ గురుకులాల్లోని విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నగరంలోని శర్మనగర్‌లో గల బీసీ గురుకుల బాలికల పాఠశాలలో దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలకు పెండింగ్‌లో ఉన్న అద్దె యాభై శాతం చెల్లించినట్లు తెలిపారు. రూ.100కోట్ల మేర విడుదల చేసినట్లు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించే క్రమంలో సమీకృత భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే, క్రీడా రంగంలో కూడా రాష్ట్రాన్ని ముందువరుసలో ఉంచేలా వారికి ప్రాథమిక స్థాయి నుంచే శిక్షణ ఇచ్చేందుకు అనువుగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మెస్‌చార్జీలు మూడు నుంచి ఏడో తరగతి వరకు రూ.1,330, పదో తరగతి వరకు రూ.1540, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.2,100 అందజేయనున్నట్లు చెప్పారు. కాస్మోటిక్ చార్జీలు బాలికలకు 3నుంచి 7 వరకు రూ.175, 8నుంచి 10 వరకు రూ.275, బాలురకు 3 నుంచి 7 వరకు రూ.150, 8 నుంచి 10 వరకు రూ.200 అందజేయనున్నట్లు వెల్లడించారు. గతంలో విద్యార్థి నాయకుడిగా కొనసాగిన సందర్భంలో ధర్నాలు చేపట్టి మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచేందుకు ఒత్తిడి తెచ్చేవారమని గుర్తు చేశారు. అంతకుముందు విద్యార్థినులతో కలిసి కేకు కోసి, వారికి తినిపించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, ఆర్సీవో అంజలి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పలువురు కార్పొరేటర్లు, గురుకుల పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సర్వే గడువులోగా పూర్తి చేయాలి

గంగాధర: మధురానగర్‌లో సామాజిక సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్

గంగాధర/ రామడుగు, నవంబర్ 1: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను గడువులోగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ ఆదేశించారు. గంగాధర మండలం మధురానగర్‌లో నిర్వహిస్తున్న సామాజిక సర్వేను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలో ప్రతి ఒక్క కుటుంబ వివరాలను సేకరిస్తూ గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రామడుగు మండలం వెదిరలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేను అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయి తనిఖీ చేశారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ తహసీల్దార్ వెంకటలక్ష్మి, కార్యదర్శి మల్లికార్జున్, కారోబార్ అశోక్‌రెడ్డి, సీఆర్పీ అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ స్టిక్కర్లు

ఇల్లందకుంట, నవంబర్ 1: మండల కేంద్రంలో సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా ఇండ్లకు ఎన్యుమరేటర్స్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పుల్లయ్య మాట్లాడుతూ.. ఈనెల 1 నుంచి 3 వరకు గ్రామాల్లో ప్రతి ఇంటింటికీ ఎన్యుమరేటర్స్ స్టిక్కర్లను అతికిస్తారని తెలిపారు. ఇక్కడ ఎంపీవో రాజేశ్వరావు, మండల ప్రత్యేకాధికారి కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్వే సామగ్రి పంపిణీ

కరీంనగర్ రూరల్, నవంబర్ 1: ఈ నెల 6న ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహణపై కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంజీవరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సర్వే నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేయడంతోపాటు సంబంధిత సామగ్రిని పంచాయతీ కార్యదర్శులకు అందించారు. కాగా, శుక్రవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో సర్వేలో భాగంగా గ్రామ ప్రత్యేకాధికారి సత్యం, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లుగీత కార్పొరేషన్‌ను వెంటనే ప్రకటించాలి

కార్పొరేషన్, నవంబర్ 1: రాష్ట్రంలోని గీత కార్మికులను ఆదుకోవడానికి వెంటనే కల్లుగీత కార్పొరేషన్‌ను ప్రకటించాలని గౌడ సంఘం నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అలాగే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచాలని, గీత కార్మికుల ఉపాధి కోసం ప్రతి గ్రామంలో 10 ఎకరాల్లో వన మహోత్సవం ద్వారా తాటి, ఈత వనాల పెంపకానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. మద్యం టెండర్లలో గౌడ కులస్తులకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 10 శాతం రిజర్వేషన్లను పెంచాలని, 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మండల, జిల్లా కేంద్రాల్లో నీరా కేఫ్‌లను ఏర్పాటు చేసి గౌడ కులస్తులకు ఉపాధి అవకాశాలు పెంచాలని, గౌడ నిరుద్యోగ యువతకు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికుమార్ గౌడ్, నాయకులు పొన్నం శ్రీనివాస్ గౌడ్, మాచర్ల అంజన్న, సంపత్ గౌడ్, దూలం అంజన్న, బొమ్మ ఈశ్వర్ గౌడ్, చెప్యాల శ్రీనివాస్. గణగోని సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులను బీసీ ఏలో చేర్చాలి

కార్పొరేషన్, నవంబర్ 1: వెనుకబడిన మేరు కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్‌కు జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు పెండ్యాల మహేశ్‌కుమార్, నాయకులు వినతిపత్రం అందించారు. ఇతర కులాలకు కుట్టు మిషన్లు ఇచ్చి తమకు జీవనాధారం లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. మేరు కులస్తులకు కొత్త విజ్ఞానం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘ నాయకులు మాడిశెట్టి కిషన్, మాడిచెట్టి నందగోపాల్, లక్ష్మీనారాయణ, మాడిశెట్టి స్వామి, రాపర్తి కిరణ్, సూర్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలసీని మార్చుకోవాలి

హుజూరాబాద్, నవంబర్ 1: సీఎంఆర్ విషయంలో ప్రభుత్వం తన పాలసీని మార్చుకోవాలని రైస్ మిల్లర్ల అసోసియేషన్ హుజూరాబాద్ మండల మాజీ అధ్యక్షుడు శీల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పిండి కోసం కిలో గింజలను మరపిడితేనే రూ. పది తీసుకుంటున్న ఈ రోజుల్లో, ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 30 ఇస్తామనడం సమంజసం కాదని పేర్కొన్నారు. బ్యాంకు గ్యారెంటీలు, ఇతరత్రా నిబంధనలు పెట్టకుండా ప్రభుత్వం సీఎంఆర్ ధాన్యాన్ని పాత పద్ధతిలోనే మిల్లర్లకు అప్పగించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 1 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో 2024 విద్యా సంవత్సరానికి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 26వ బ్యాచ్‌లో అడ్మిషన్ల కోసం ఆసక్తిగల అభ్యర్థులు 15 నవంబర్ 2024లోగా తమ అప్లికేషన్లు తెలుగు విభాగంలో అందించాలని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలోని తెలుగు విభాగంలో కన్వీనర్ డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్‌ను సంప్రదించాలని సూచించారు.

హార్వెస్టర్‌లో ఇరుక్కుని తెగిన చేయి

శంకరపట్నం, నవంబర్ 1: ప్రమాదవశాత్తు వరికోత యంత్రంలో ఇరుక్కుని చేయి తెగిన ఘటన మండలంలోని చింతగుట్టలో చోటు చేసుకుంది. లింగాపూర్ గ్రామానికి చెందిన పోనేటి ప్రశాంత్ కొంత కాలంగా హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం చింతలపల్లి గ్రామంలో వరికోత యంత్రంతో వరి కోస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ప్రశాంత్ ఎడమ చేయి హార్వెస్టర్ యంత్రంలో ఇరుక్కుంది. రైతులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్నే ఈఎంటీ సురేశ్ కుమార్, పైలట్ అశోక్ ప్రథమ చికిత్స అందిస్తూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

తడి, పొడి విధానంపై రైతులకు అవగాహన

మానకొండూర్‌రూరల్, నవంబర్ 1: మండలంలోని దేవంపల్లి రైతు వేదికలో కోర్ కార్బన్ ఎక్స సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, పద్మపాని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వరిలో తడి, పొడి విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రీజినల్ మేనేజర్ చందు మాట్లాడుతూ, వరి పాలం నుంచి వెలువడే మిథేన్ విషవాయువు వాతావరణంపై ప్రభావాన్ని చూపుతుందని, తద్వారా వరిలో తెగుళ్లు, దోమ పాటు వంటివి వ్యాప్తి చెందుతాయని తెలిపారు. తడి, పొడి విధానాన్ని పాటించినట్లయితే తెగుళ్లను నివారించవచ్చని, దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. పర్యావరణాన్ని సైతం కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, క్లస్టర్ కో ఆర్డినేటర్ కొండల్ రెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ మర్రి దేవేందర్ రెడ్డి, శ్యామ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించాలి

తిమ్మాపూర్, నవంబర్ 1: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో దళిత నేతలు ఏర్పాటు చేసుకున్న అంబేద్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాల ముసుగులు తొలగించి, ఘనంగా ఆవిష్కరించాలని, లేదంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని బీఆర్ఎస్ దళిత నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులను విగ్రహాల వద్దకు వచ్చి వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరామని, అయితే ఎవరూ రాలేదని తెలిపారు. విగ్రహాలు ఆవిష్కరించేదాక నిరసనలు తెలుపుతూనే ఉంటామని స్పష్టం చేశారు. నిరసనలో పంతడుపుల సంపత్, వడ్లూరి శంకర్, బోయిని తిరుపతి, సంగుపట్ల మల్లేశం, పాశం అశోక్‌రెడ్డి, కమ్మం కృష్ణ, బుర్ర రవీందర్, సంపత్, అజయ్, కిన్నెర అంజి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిమ్మాపూర్, నవంబర్1: పోరండ్ల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మక్తపల్లి గ్రామానికి చెందిన గంట యాకయ్య(20) చుట్టు పక్కల గ్రామాల్లో తిరుగుతూ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తిమ్మాపూర్ నుంచి పోరండ్ల వైపు వెళ్తుండగా పోరండ్ల శివారులో ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై మట్టి పోసి ఉండగా చీకట్లో కనిపించక బైక్ అదుపుతప్పి కిందపడినట్లు తెలుస్తున్నది. ఘటనా స్థలానికి ఎల్ఎండీ పోలీసులు చేరుకుని బైక్ అదుపుతప్పి పడ్డాడా.. ఏదైనా వాహనం ఢీ కొట్టిందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. యాకయ్యకు భార్య, ఒక బిడ్డ ఉన్నది.

రైల్వేశాఖ కాపర్ వైర్ చోరీ

- ఇద్దరి అరెస్టు.. సొత్తు రికవరీ
- సీఐ రవి వెల్లడి

జమ్మికుంట, నవంబర్ 1: రైల్వేశాఖకు చెందిన కాపర్ వైర్‌ను చోరీ చేసిన వ్యక్తితోపాటు, దానిని కొనుగోలు చేసి మరొకరిని జమ్మికుంట పోలీసులు అరెస్టు చేశారు. రూ.4లక్షల 50వేల విలువజేసే సొత్తును రికవరీ చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీ రవి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని దుర్గాకాలనీ సమీపంలోని మడిపల్లి క్రాస్‌లో రైల్వేశాఖకు చెందిన కాంట్రాక్టర్ కిరణ్ ఓ గోదాంను అద్దెకు తీసుకుని రైల్వే పనులకు సంబంధించిన సామగ్రిని నిల్వ చేసుకున్నాడు. గత నెల 29న దుండగులు గోదాం తాళాలు పగులగొట్టి 500కిలోల కాపర్ వైర్‌ను చోరీ చేశారు. గోదాం ఇన్‌చార్జి జగదీశ్‌దాస్ ఫిర్యాదు మేరకు నాలుగు పోలీసు టీంలు రంగంలో దిగాయి. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేశారు. చోరీ జరిగిన తర్వాత బొలెరో వాహనంలో సామగ్రిని తరలించి, కీసర మండలం నాగారం(బండ్లగూడ)లోని స్క్రాప్ కొనుగోలుదారు హేమ కనకయ్యకు విక్రయించినట్లు గుర్తించారు. ఇదే సమయంలో పట్టణంలోని మోత్కులగూడెం సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. దాన్ని పట్టుకోగా, అందులోనూ కాపర్ వైరు కనిపించింది. కాపర్ వైరుతో పాటు వాహనాలను సీజ్ చేశారు. నల్గొండకు చెందిన బీ సందీప్(ప్రస్తుతం ఆటో నడుపుకొంటూ ఎల్‌బీ నగర్‌లో ఉంటున్నాడు), నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన బానోత్ బాలు ఈ చోరీ చేశారని తేలింది. చోరీ చేసిన సందీప్‌తో పాటు కాపర్ వైరును కొనుగోలు చేసిన కనకయ్యను అదుపులోకి తీసుకున్నారు. బాలు పరారీలో ఉన్నాడని సీఐ చెప్పారు. సందీప్, తదితరులపై రైల్వేలో కేసులున్నాయని, వాటిపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. కాపర్ వైర్‌ను వాహనంలో ఎక్కించేందుకు కొందరు మహిళలు సహకరించారని, సదరు మహిళలు చోరీకి సహకరించేందుకు వచ్చారా..? కూలి కోసం వచ్చారా..? అనే కోణంలో ఆరా తీస్తున్నామని చెప్పుకొచ్చారు. దొంగతనం జరిగిన 48గంటల్లో కేసు ఛేదించిన ఎస్ఐ ఆరోగ్యం, హెచ్‌సీలు మోహన్, సదయ్య, సంపత్, పీసీ వేణు, సిబ్బందిని సీఐ అభినందించారు.

పటాకుల షాపులపై కేసుల నమోదు

జమ్మికుంట, నవంబర్ 1: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో పటాకుల షాపులకు విద్యుత్ మీటర్‌లేదని, తూకాల్లో మోసాలు చేస్తున్నారని ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా విద్యుత్ శాఖ ఏడీఈ రాజేందర్, ఏఈ ఆనందం ఆధ్వర్యంలో షాపులకు మీటర్‌ను అమర్చారు. షాపులన్నీ పరిశీలించారు. అనంతరం తూనికలు, కొలతలశాఖ అధికారి భూలక్ష్మి వచ్చారు. 16 షాపులను తనిఖీ చేశారు. తూకాల్లో మోసాలకు పాల్పడిన రెండు షాపులపై కేసు నమోదు చేసి, రూ.2వేల చొప్పున జరిమానా విధించారు. తర్వాత ఫైర్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, తన సిబ్బందితో కలిసి నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి

చొప్పదండి/ శంకరపట్నం/ గంగాధర/ కరీంనగర్ రూరల్, నవంబర్ 1: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. చొప్పదండి, శంకరపట్నం మండల కేంద్రాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో, గంగాధర మండలం మధురానగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమానికి కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకౌంట్స్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ

తెలంగాణ చౌక్, నవంబర్ 1 : కరీంనగర్ రీజియన్ నూతన అకౌంట్స్ ఆఫీసర్‌గా జి. మనోహర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన చీకోటి వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేయడంతో కరీంనగర్ రీజియన్ అకౌంట్స్ ఆఫీస్‌లో అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్) విభాగంలో పనిచేస్తున్న మనోహర్‌రెడ్డి నూతన అకౌంట్స్ ఆఫీసర్‌గా నియామకమయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు అకౌంట్స్ ఆఫీసు సూపర్‌వైజర్లు బి. మొగిలి, పి. కిరణ్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కారుణ్య నియామకాల కోసం కృషి

కరీంనగర్, నవంబర్ 1 : జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తానని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ కారుణ్య నియామక అభ్యర్థులు టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన, త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశ ఎజెండాలో జడ్పీలో కారుణ్య నియామకాల అంశాన్ని చేర్చేలా మంత్రులతో మాట్లాడుతానన్నారు. కార్యక్రమంలో నాయకులు అలుక కిషన్, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, సర్దార్ హర్మీందర్‌సింగ్, కోట రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

వీణవంక, నవంబ